# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 21-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఈరోజు దర్శించుకున్నారు.**

2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైద్యారోగ్యశాఖ సహా పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**

3. **మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు.**

4. **నాగార్జున సాగర్ కుడికాలువకు పడిన గండిని పూడ్చామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

5. **గోవాలో జరుగుతున్న చలనచిత్రోత్సవంలో భాగంగా మాస్టర్ క్లాస్‌లను కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ ప్రారంభించారు.**

==========================

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఈరోజు దర్శించుకున్నారు. మొదటగా తిరుమలలోని వరాహస్వామిని దర్శించుకున్న అనంతరం రాష్ట్రపతి ప్రధాన ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, ఆలయ కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్, వేదపండితులు ఇస్తికాఫాల్ స్వాగతం పలకగా రాష్ట్రపతి శ్రీవేంకటేశ్వర స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు రాష్ట్రపతిని వేదఆశీర్వచనం చేయగా టిటిడి ఉన్నతాధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. తరువాత తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్ కు బయలుదేరి వెళ్లారు.

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో తొలుత వైద్యారోగ్యశాఖపై సంబంధిత అధికారులతో రాష్ట్రంలో అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రుల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రారంభించిన సంజీవని ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ ప్రయివేట్ భాగస్వామ్యం –పీపీపీ విధానంలో చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణాలను

పూర్తి చేసేలా చర్యలు తీసుకుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే గృహ నిర్మాణశాఖపై జరిగిన సమీక్షలో ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు, నాణ్యతపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. అనంతరం వ్యవసాయ శాఖపై సమీక్షిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. మత్స్యకారుల జీవనోపాధి, వారి కుటుంబాల భద్రతకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్య ఉత్పత్తిని అభివృద్ధి చేయడంతో పాటు ఈ రంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు, మత్స్యకారుల ఆదాయాన్ని పెంపొందించేందుకు, ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆక్వా రైతులకు విద్యుత్ పై సుంకాలు తగ్గించి, ఈ రంగం అభివృద్ధికి సహకారం అందిస్తున్నామని వెల్లడించారు.

---------------------------

మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా తూర్పు నాయుడు పాలెంలోని చెరువులో ఆయన చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, ట్యాంకులు, చెరువుల్లో 7లక్షల చేపపిల్లలను వదలనున్నట్టు చెప్పారు.మత్స్యకారుల కోసం ప్రభుత్వం 20వేల రూపాయలు వేట నిషేధ భృతిని అందిస్తోందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

నాగార్జున సాగర్ కుడికాలువ వద్ద కారంపూడి ఎస్కేప్ ఛానల్ కట్టకు గత అర్ధరాత్రి గండి పడింది. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు గండిపడ్డ చోటుకు చేరుకుని గండిని పూడ్చే పనులను చేపట్టారు. నాగార్జున సాగర్ కుడికాలువ గండిపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను అప్రమత్తం చేశారు. సమీప గ్రామాల్లోకి నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. గండి పడటానికి గల కారణాలను నివేదిక రూపంలో అందించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు గండిని పూడ్చారని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

---------------------------

శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయిబాబా శతజయంతి వేడుకలకు ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు ఈ రోజు హాజరయ్యారు. ప్రశాంతి నిలయానికి చేరుకున్న ఆయన సాయి కుల్వంత్ సభా మందిరంలో సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకుని నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి బాబా సేవే పరమ ధర్మమనేది ఆచరించి చూపించారని. ప్రజలకు త్రాగునీరు, విద్య, వైద్యం వంటి సామాజిక అవసరాలను ప్రజలకు అందించేందుకు చేసిన కృషి మరువలేనిదని చెప్పారు.

---------------------------

గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం –ఇఫీ రెండవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పణాజీలోని కళా అకాడమీలో సినిమా మాస్టర్ క్లాస్‌లను కేంద్ర సమాచార, ప్రసార శాఖ

సహాయ మంత్రి ఎల్ మురుగన్, సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి ఈ రోజు ప్రారంభించారు. అలాగే డోనా పౌలాలో ఫిల్మ్, డిజిటల్ కంటెంట్ సహ–నిర్మాణంపై అంబాసిడర్ల రౌండ్ టేబుల్ సమావేశంలో మురుగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పైరసీ నిరోధక చర్యలను మెరుగుపరచడం, అంతర్జాతీయ చలనచిత్ర సహకారం, సహ–నిర్మాణ అవకాశాలను విస్తరించడం, ప్రపంచ చలనచిత్రోత్సవాలలో భారతీయ సినిమాను ప్రోత్సహించడం వంటి అంశాలపై చర్చించారు.

---------------------------

రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.యస్ జవహర్ అన్నారు. విజయనగరం లో నిన్న పర్యటించిన ఆయన స్థానిక జిల్లా పరిషత్ అతిథిగృహంలో ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ఎస్సీ కమిషన్ కు వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని జవహర్ ఈ సందర్భంగా తెలియజేస్తూ

వాయిస్ 21 సెకన్లు

---------------------------

తయారీ రంగంలో ఉద్యోగ కల్పన, సామాజిక భద్రతను మెరుగుపరచడానికి ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ – ఈఎల్ఐ పథకం దోహదపడుతుందని ఉద్యోగుల భవిష్య నిధి – ఇపిఎఫ్ఓ ప్రాంతీయ పిఎఫ్ కమిషనర్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. విజయవాడలో ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజన, ఈఎల్ఐ పథకంపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ 24 సెకన్లు

---------------------------

ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడనుందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి దక్షిణ మధ్య బంగాళాఖాతంలోని మధ్య ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడనుందని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్ నారాయణ తెలియజేస్తూ...

..వాయిస్.. 19 సెకన్లు

---------------------------

నేడు ప్రపంచ టెలివిజన్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. సమాచార ప్రసార మాధ్యమాల్లో టెలివిజన్ ప్రాముఖ్యతను తెలియచేసేందుకు 1996 డిసెంబరులో ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సమావేశంలో నవంబర్ 21వ తేదీని ప్రపంచ టెలివిజన్ దినోత్సవంగా ప్రకటిస్తూ...తీర్మానం చేసింది.

=====================